

శ్రీరామ్ నగర్ బస్తీబాటలో అజహరుద్దీన్, రహ్మత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి

## సమస్యలను పరిష్కరిస్తా : అజహరుద్దీన్

**బోరబండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి):** నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని టీమిండియా మాజీ కెప్టెన్, జూబ్లీ హిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహమ్మద్ అజహరుద్దీన్ అన్నారు. రహ్మత్ నగర్ డివిజన్ శ్రీరామ్ నగర్ లో కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బస్తీబాటలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో శ్రీరామ్ నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఉమర్ అలీ, అధికారులు, డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

**యూసుఫ్ గూడా, జూలై 15 (ఆంధ్రజ్యోతి):** మతి స్థిమితం లేని యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్ నగర్ కు చెందిన నాగమణి ఈ నెల 10న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాక పోవడంతో భర్త.. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించ లేదు. మంగళవారం పోలీసులకు భర్త సాంబయ్య ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

## ఒక్క గంట పని పేరిట ఎర

● రూ. 59,954 పోగొట్టుకున్న మహిళ

**యూసుఫ్ గూడా, జూలై 15 (ఆంధ్రజ్యోతి):** సైబర్ కేటుగాడి మోసానికి మహిళ నగదు పోగొట్టుకుంది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీ కృష్ణానగర్‌కు చెందిన జయలక్ష్మికి ఈనెల 2న సెల్ ఫోన్ వాట్సాప్‌కు సమాచారం వచ్చింది. ఆన్‌లైన్‌లో ఒక్క గంట పని చేస్తే మూడు నుంచి పది వేల రూపాయల వేతనం ఇస్తామని నమ్మించాడు. 59,954 రూపాయలను విడతలవారీగా ఆమె వద్ద వసూలు చేశారు. చెల్లించిన నగదు తిరిగి రాక పోవడంతో గట్టిగా నిలదీస్తే అందుబాటులో లేకుండాపోయాడు. మోసపోయానని తెలుసుకొని భర్త సహకారంతో బాధితురాలు మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## ద్విచక్ర వాహనం చోరీ

**యూసుఫ్ గూడా, జూలై 15 (ఆంధ్రజ్యోతి):** ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్‌నగర్‌కు చెందిన సామయ్య చిరు వ్యాపారి.. ఈనెల 7న కళ్యాణ్‌నగర్‌లోని హైదరాబాద్ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద తన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని పార్క్ చేశారు. లోపలికెళ్లి తిరిగొచ్చే లోపు కనిపించకుండాపోయింది. చుట్టుపక్కల ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఈ చోరీపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



విద్యుత్ తీగలు తెగిపోవడంతో బంచ్ కేబుల్ వేస్తున్న ఉద్యోగి

## మధురానగర్ బి-బ్లాక్‌లో తెగిన విద్యుత్ తీగలు

● యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

**వెంగళరావునగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి):** వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ బి-బ్లాక్‌లో మంగళవారం తెల్లవారుజాము చెట్టుకొమ్మలు వాలిపోవడం వల్ల విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో ఏ, బీ బ్లాక్ లలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానికులు, కాలనీ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు.. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఏఈ తిరుపతి రావు, సిబ్బంది ఈ ప్రాంతానికి చేరుకొని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి సరఫరాను మధ్యాహ్నం లోపు పునరుద్ధరించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**పంజాగుట్ట,జూలై 15(ఆంధ్రజ్యోతి):** మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టీవీ-5, శ్రీనగర్ కాలనీ, జలగం వెంగళరావు పార్క్, ఐవీఆర్సీఎల్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిలింనగర్, ఎల్లారెడ్డిగూడ, బంజారాహిల్స్ రోడ్‌నంబర్-1, పంజాగుట్ట మోడల్ హౌస్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

### ● శాకాంబరిదేవిగా దర్శనం



ఆషాడ మాసం సందర్భంగా ప్రేమ్‌నగర్‌లోని ఎల్లమ్మ, నల్లపోచమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారు శాకాంబరి దేవిగా దర్శనం ఇచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విశేష పూజలు నిర్వహించారు. ఈనెల 20న బోనాల ఉత్సవాలు, ఘటాల ఊరేగింపు నిర్వహిస్తామని బస్తీ అధ్యక్షుడు డి.విశ్వనాథం తెలిపారు.

పంజాగుట్ట, జూలై15(ఆంధ్రజ్యోతి):

# పీలీ రోడ్డుతో పరేషాన్



పీలీ దర్గా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన ఇటుకలు

● విస్తరించినా తలెత్తుతున్న ఇవే సమస్యలు

● ఫుట్‌పాత్ ఆక్రమించి చిరువ్యాపారాలు

● ఇప్పటికే ట్రాఫిక్ జామ్‌తో సతమతం

**బోరబండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి):** ఇప్పటి వరకు ఇరుకు రోడ్డు.. వాహనదారులు నిత్యం ట్రాఫిక్ జామ్‌తో సతమతమవుతున్నారు. దీంతో మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో రోడ్డును విస్తరించారు. ఇక సాఫీగా ప్రయాణం సాగుతుందని వాహనదారులు భావించారు. కాని విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడంతోపాటు.. ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌పై చిరువ్యాపారాలు సాగిస్తున్నారు. మరోవైపు విస్తరించిన రోడ్డులో కొంత మంది వ్యాపారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకొని వాటి పై భవన నిర్మాణాలకు వాడే ఇటుక, ఇసుక, కంకర వంటి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ట్రావెల్స్ నిర్వాహకులు కార్లను పార్కింగ్ కారు పార్కింగ్‌కూ ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం వాహనదారులు తమ వెహికల్స్ రాకపోకలకు సాగించేందుకు తిప్పలు తప్పడంలేదు. ఇదీ పీలీ రోడ్డులో దుస్థితి..

సైట్-2 పీలీ దర్గా ముందు రోడ్డు విస్తరణలో భాగంగా రహదారిని వెడల్పు చేసి సీసీ రోడ్డు నిర్మించారు. కాని రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించక పోవడంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన చెక్కలు

చేయడం ద్వారా విస్తరించిన రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని వాహనదారులు, స్థానికులు అంటున్నారు.

● సైట్-2 మల్లన్నస్వామి గుడి సమీపం నుంచి సైట్-2 ప్రభుత్వ ఆసుపత్రి వరకు విశాలమైన రహదారి ఉంది. ఈ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా కొంతమంది భవన నిర్మాణాలకు వినియోగించే ఇటుక, ఇసుక, కంకరతో పాటు ముడి సరుకులకు వినియోగించుకుంటున్నారు. ఈ వస్తువుల వల్ల వాహనదారులకు ఆటంకం కలుగుతోంది. సరుకుతో వచ్చే లోడు లారీలు రోడ్డు పైనే ఆపి దింపుకొంటున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని వాహనదారులు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఆక్రమణలు జరుగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు.

### రోడ్డు విస్తరించింది ఇందుకేనా?

కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ప్రజల సౌకర్యం కోసం రోడ్డు విస్తరించారు. పాదచారులకు ఇబ్బంది కలగకుండా ఫుట్‌పాత్‌లను కూడా నిర్మించారు. కాని అధికారుల పర్యవేక్షణ కొరవడంటంతో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. కార్ల పార్కింగ్, చిరు వ్యాపారులకు అడ్డాగా మారింది. ఇలాగే వదిలేస్తే విస్తరించిన రోడ్డు, ఫుట్ పాత్ మొత్తం ఆక్రమణకు గురవుతుందేమోనని సందేహం కలుగుతోంది. వెంటనే కారులు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి. అలాగే చిరు వ్యాపారుల ఉపాధికి ఇబ్బందులు కలగకుండా మరొక ప్రాంతంలో ఏర్పాటు చేయాలి.

-లక్ష్మణ్‌రెడ్డి,బోరబండ

## ప్రజావాణికి 353 అర్జీలు



ప్రజావాణిలో చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్‌లు

**బేగంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి):** మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీ.ఎం ప్రజావాణికి మొత్తం 353 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమ ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు 60, రెవెన్యూకు 63, విద్యుత్‌కు 22, రేషన్‌కార్డుల కోసం 7, ఇందిరమ్మ ఇళ్ల కోసం 57, ఇతర శాఖలకు సంబంధించి 144 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు.

## కుంగదీసిన మనోవేదన

● ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

**పంజాగుట్ట, జూలై 15(ఆంధ్రజ్యోతి):** మనోవేదనతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన ఎస్.అనసూయ కొన్నేళ్ల క్రితం కుటుంబసభ్యులతో కలిసి నగరానికొచ్చి ఎల్లారెడ్డిగూడ శాలివాహన నగర్‌లో నివాసం ఉంటున్నారు. కుమారుడు ఎస్.అనిల్ కుమార్ ప్రస్తుతం సొంతగా ఈవెంట్ మేనేజ్‌మెంట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈనెల 13న రాత్రి నిజామాబాద్‌కు ఈవెంట్ మెటీరియల్‌ను పంపించాడు. ఈ క్రమంలో 14న తన గదిలోకి వెళ్లి నిద్రించాడు. తలుపులు కొట్టినా గానీ ఎంతకీ తీయకపోవడంతో స్థానికులతో కలిసి వాటిని పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని అనిల్ కుమార్ విగతజీవిగా కనిపించాడు. అయితే తాను చదువుకునే రోజుల్లో బీటెక్ పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతున్నాడు. తల్లి అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మేళాలో బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న అంకుర సంస్థల ప్రతినిధులు

## లోన్‌మేళాకు విశేష స్పందన

**బోరబండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి):** లోన్‌మేళాకు విశేష స్పందన లభించింది. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం -2025 సందర్భంగా యూసుఫ్‌గూడలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నిమ్స్‌మేలో మంగళవారం నిర్వహించిన ఈ మేళాలో యువత, అంకుర సంస్థలు, ఆశావహ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహకారం, వ్యాపార అభివృద్ధి సూత్రాలను వివరించారు. లోన్ అర్హత, అవసరమైన పత్రాలు, ప్రాజెక్ట్ రిపోర్టు, తయారీ, ఉత్పత్తి తదితర అంశాలపై విలువైన సమాచారాన్ని గురించి ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ కేంద్రం (సీఎఫ్ఐ) ఛైర్మన్ కామేశ్వర రావు తెలిపారు. నిమ్స్‌మే ఫ్యాకల్టీ సభ్యురాలు వి.స్వప్న మాట్లాడుతూ ఏటీఐ పథకం కింద దేశవ్యాప్తంగా యువతకు నైపుణ్యాలు అందించేందుకు చేపట్టిన శిక్షణ కార్యక్రమాలను తెలియజేశారు.





బోనాలతో మహిళా ఉద్యోగులు, అమ్మవారి సన్నిధిలో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

# బోనమెత్తి.. భక్తితో సమర్పించి..

**హైదరాబాద్ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి):** హెచ్ఎండీఏ కార్యాలయంలో మంగళవారం ఘనంగా బోనాలు నిర్వహించారు. అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌లో గల కార్యాలయ ఆవరణలోని బంగారు మైసమ్మ అమ్మవారికి ఉద్యోగులు పెద్దఎత్తున బోనాలుతోపాటు వడిబియ్యంతో మొక్కులు తీర్చారు. ముందుగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జాయింట్ కమిషనర్ శ్రీవాత్సవలు దర్శించుకున్నారు. చీఫ్ ఇంజనీర్లు రవీందర్, పరంజ్యోతి, ప్లానింగ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్‌నాయక్, ఓఎస్డీ చంద్రారెడ్డి, కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, ఉమ్టా ఎండీ జీవన్‌బాబు, సీపీఓలు యశ్వంత్‌రావు, ప్రసాద్‌రావు, మల్లికార్జున్, వికాస్, హెచ్ఎండీఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రామచంద్రం, ఉమాలతో పాటు మాజీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, కుమారస్వామి, తెలంగాణ ఉద్యోగుల సంఘం ఛైర్మన్ ఏ.పద్మాచారి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ శిబిరంలో దివ్యాంగులు, బీజేపీ నాయకులు

## 160 మంది అర్హుల గుర్తింపు

**అమీర్‌పేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి):** దివ్యాంగులకు అవసరమైన ఉపకరణలు, సహాయ పరికరాలు ఉచితంగా అందించేందుకు మంగళవారం గురు గోబింద్‌సింగ్ ఇండోర్ స్టేడియంలో శిబిరాన్ని నిర్వహించారు. 270 మంది దివ్యాంగులు హాజరు కాగా 160 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి ఉపకరణాలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అందజేయనున్నారు. కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు శ్యామ్ సుందర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ సరళ, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, దయానంద్ తో పాటు ఆరు డివిజన్ ల అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఓపెన్ వర్సిటీలో యూజీ, పీజీ అడిష్మన్లు ప్రారంభం

**బేగంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి):** డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బేగంపేట సెంటర్‌లో డిగ్రీ, పీజీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ రామాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైనవారు డిగ్రీకి అర్హులని పేర్కొన్నారు. ఎంఏ హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు లిటరేచర్, ఇంగ్లిష్ లిటరేచర్, హిందీ లిటరేచర్, ఉర్దూ లిటరేచర్‌లో డిగ్రీ ఉత్తీర్ణత గలవారు అడ్మిషన్లు పొందొచ్చన్నారు. తుదిగడువు ఆగస్టు 13వ తేదీ అని పేర్కొన్నారు.

## రాధామనోహర్‌దాస్ పై చర్యలేవి?

**పంజాగుట్ట,జూలై 15(ఆంధ్రజ్యోతి):** సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలను రెచ్చగొడుతున్న ఇన్‌ఫ్లూఎన్సర్ రాధామనోహర్ దాస్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని క్రైస్తవ సామాజిక వర్గానికి చెందిన పలువురు డిమాండ్ చేశారు. బంజారాహిల్స్ పోలీసులకు ఆయనపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోక్య స్వామి జోసెఫ్, పలువురు మాట్లాడుతూ క్రైస్తవుల మనోభావాలు దెబ్బతినేలా వివిధ సందర్భాల్లో దైవదూషణ చేశారన్నారు. మే 31న బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో ఆయనపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. కాని 45 రోజులు గడిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు అశోక్, సరోజ భాస్కర్, శ్యామ్,ఆరోగ్య రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కీళ్ల మార్పిడిలో 'ఇంటెల్లి జాయింట్' కీలకం

● మెడికవర్ ఆస్పత్రి డాక్టర్ కృష్ణ కిరణ్



**హైదరాబాద్ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి):** కీళ్ల మార్పిడిలో ఇంటెల్లి జాయింట్ వంటి టూల్‌లు సర్జరీలో కచ్చితత్వం కలిగి ఉంటాయని, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవచ్చని మెడికవర్ ఆస్పత్రి తుంటి, మోకాలి మార్పిడి శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ కృష్ణ కిరణ్ తెలిపారు. నోవోటెల్ హెచ్ఐసీసీలో మంగళవారం నిర్వహించిన 'హిప్ మాస్టర్స్ కోర్సు' లో భాగంగా 'ఏ టు జడ్ అబైట్ హిప్' అనే కార్యక్రమానికి అయన అధ్యక్షత వహించి మాట్లాడారు. హిప్ మాస్టర్స్ కోర్సు ద్వారా యువ సర్జన్లకు శిక్షణ ఇచ్చి, రోగులకు అత్యున్నతస్థాయి చికిత్స అందించాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. శస్త్రచికిత్స పద్ధతులు వేగంగా మారుతున్న నేపథ్యంలో, విద్యలో నిరంతర అభ్యాసం ఎంతో కీలకమన్నారు. తుంటి, మోకాలి మార్పిడి శస్త్రచికిత్సల సమయంలో సర్జన్లకు 'రియల్‌టైమ్ ఇంట్రాఆపరేటివ్ గైడెన్స్'ను అందించి, శస్త్రచికిత్స కచ్చితత్వంను పెంచి, ఇంప్లాంట్ స్థితిని మెరుగుపరచడంలో ఇంటెల్లి జాయింట్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ముఖ్యంగా సంక్లిష్టమైన ప్రాథమిక, పునరుద్ధరణ కేసులలో ఎంతో ఉపయోగపడుతోందన్నారు. అమెరికా సహా అనేక దేశాల నుంచి ప్రముఖ ఆర్థోపెడిక్ అధ్యాపకులు, దేశవ్యాప్తంగా 200 మందికి పైగా ఆర్థోపెడిక్ సర్జన్లు, ట్రైనీలు పాల్గొన్నారు.



శిల్పారామంలో బోనాల ఉత్సవాల్లో మహిళా పారిశ్రామిక వేత్తలు

## బోనాల ఉత్సవాలు

**హైటెక్ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి):** మాదాపూర్ శిల్పారామంలోని ఇందిరా మహిళా శక్తి బజార్ స్వయం సహాయక మహిళా పారిశ్రామిక వేత్తలు బోనాల ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. ముందుగా మహిళల ఆటపాటలు అలంరించాయి. స్పెషల్ ఆఫీసర్ సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రాజెక్టు మేనేజర్ సతీష్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

## బ్యాగులు, నోట్‌పుస్తకాల పంపిణీ

**ఖైరతాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి):** రాజ్‌భవన్ పాఠశాలలో చదవడం విద్యార్థులు అదృష్టంగా భావించాలని, ఇక్కడ అభ్యసించిన ఎంతో మంది ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారని కార్పొరేటర్ విజయారెడ్డి గుర్తుచేశారు. పీజేఆర్ ఫౌండేషన్ తరఫున నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్యాగులు, నోట్‌పుస్తకాల పంపిణీ మంగళవారం రాజ్ భవన్ పాఠశాలలో చేశారు. ఈ పాఠశాలలో చదివి ఐఐటీలో సీటు పొందిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కష్టపడి చదవి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

## దుకాణాల సీజ్



కేబీఆర్ పార్కులో దుకాణాన్ని సీజ్ చేస్తున్న ఉప కమిషనర్ సమ్మయ్య, ఎస్టేట్ అధికారులు

**ఖైరతాబాద్,జూలై15(ఆంధ్రజ్యోతి):** కాసు బ్రహ్మానంద రెడ్డి పార్కు వద్ద జీహెచ్ఎంసీ నుంచి లీజుకు తీసుకున్న దుకాణాల గడువు ముగియడంతో పాటు వ్యాపార పన్ను చెల్లించని దుకాణాలను ఎస్టేట్ అధికారులు సీజ్ చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో పార్కులోని గేట్‌నంబర్ 2 వద్ద ఉన్న కాసాడి లట్టే దుకాణంతో పాటు మరో షాపును సీజ్ చేసి తాళాలు వేశారు. గేట్ నంబర్ 3 లోని అనుమతి లేని ఇంకొక దుకాణాన్ని సైతం కూల్చివేశారు.



బంజారాహిల్స్‌లో ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూల్చివేయడమే కాకుండా, ఇదేమిటని ప్రశ్నించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలపై పోలీసు కేసులు పెట్టించారని నిరసన తెలిపారు. రహ్మత్‌నగర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వ్యతిరేక నినాదాలు చేశారు.

-(బోరబండ, ఆంధ్రజ్యోతి).

## నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

బౌద్ధనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి విద్యుత్ కార్యాలయం చిలకలగూడ గాంధీబొమ్మ, పోచమ్మ టెంపుల్ ఫీడర్ పరిధిలోని బొందలగడ్డ, మైలార్‌గడ్డ, మసీద్ ఏరియా, కిందిబస్తీ, వెస్లీచర్చి, గీత నర్సింగ్‌హోమ్, దూద్‌బావి, చింతబావి, చిలకలగూడ మెయిన్‌రోడ్డు, శ్రీదేవీ థియేటర్ లైన్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ మహేష్‌కుమార్, ఏఈ శ్రీకాంత్ తెలిపారు. సీతాఫల్‌మండి ఫీడర్ పరిధిలో దత్తాత్రేయ ఆలయం, జోషి కాంపౌండ్, ఎస్‌వీఎస్ లైన్, ప్రగతి స్కూల్ ఏరియా, మోర్ సూపర్‌మార్కెట్, డీబీఆర్ వెనుక ప్రాంతం, చిలకలగూడ మెయిన్‌రోడ్డులో బుధవారం మధ్యాహ్నం రెండుగంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వారు తెలిపారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

## బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుందాం

● కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆదివారం జరిగే బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుందామని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. మంగళవారం చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయ ఆవరణలో కార్పొరేటర్ అధ్యక్షతన జరిగిన బోనాల పండుగ సమీక్షా సమావేశంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భక్తులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మహేందర్‌గౌడ్, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాలు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసులు, అడ్మిన్ ఎస్సై ఆంజనేయులు, అధికారులు కౌశిక్, కుశాల్, వెంకటేశ్, ఆలయచైర్మన్ గుంటి కృష్ణ, కమిటీసభ్యులు దేవేందర్, శ్రీనివాస్, ధర్మవీర్, జగన్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



బాపూజీనగర్ ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన

## పాఠశాలను సందర్శించిన కలెక్టర్

బోయినపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, మరింత మెరుగ్గా రాణించేందుకు ఆ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. ఈ మేరకు బుధవారం బోయినపల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలతో పాటు, వాటర్ స్పోర్ట్స్ అకాడమీని ఆమె సందర్శించారు. అనంతరం తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, హాస్టల్ వసతులు, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులు సొంత ప్రణాళికతో చదువుకోవాలని చర్చా పద్ధతిని అనుసరిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. సీఎస్‌ఆర్ ఫండ్స్ సహకారంతో ఏర్పాటు చేసిన 10 డిజిటల్ క్లాస్ రూమ్‌ల ద్వారా విద్యార్థులకు డిజిటల్ తరగతులు, కంప్యూటర్ విద్యను అందించడం, అలాగే ఎన్‌జీఓలు, ఉన్నతాధికారుల తోడ్పాటుతో పాఠశాలను మోడల్ పాఠశాలగా అభివృద్ధి చేస్తున్నందుకు ప్రధానోపాధ్యాయులు బాణోతు లాలూ నాయక్‌ను ఆమె అభినందించారు. పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులకు సిబ్బందికి ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆర్. కోటాజీ, పాఠశాల వార్డెన్లు రెబెక్కా, ఎల్లమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉచిత క్షయ వ్యాధి మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జంపన ప్రతాప్

## క్షయపై ప్రజలకు అవగాహన కల్పించాలి

బోయినపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధిపై వైద్య అధికారులు ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ అన్నారు. బుధవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సంజీవయ్యనగర్ వీకర్ సెక్షన్ కాలనీలో డాక్టర్ సాయిబాబ(ఎస్‌పీఎచ్‌ఓ) ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కాలనీవాసులకు క్షయ, మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి అవగాహన కల్పించి చికిత్స అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుష్మా, విక్టోరియా(పీహెచ్‌ఎన్), మహాదేవ్(టీబీ సూపర్‌వైజర్) రమేష్, జైసింహ, సుమిత్ర, లక్ష్మి, షబానా, కాలనీ అధ్యక్షుడు డిఎం అశోక్ కుమార్, వరప్రసాద్, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న వైద్యులు, బస్తీ నాయకులు

## తుకారాంగేట్‌లో నేత్ర వైద్య శిబిరం

అడ్డగుట్ట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ మారేడుపల్లి ఆధ్వర్యంలో మంగళవారం తుకారాంగేట్ చౌరస్తాలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో వంద మందికి పైగా పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. కంటి శస్త్ర చికిత్సలకు అవసరమైన వారిని లయన్స్ క్లబ్‌కు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ తుకారాంగేట్ చైర్మన్ హర్జీత్ సింగ్, కోశాధికారి ప్రవీణ్ కుమార్, కార్యదర్శి అనితా అగర్వాల్‌లతో పాటు బస్తీ పెద్దలు నరేందర్, రాజు, యాదగిరి, సువర్ణ, సంతోష్, మైత్రిలు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత కారణంగా ఓ గుర్తుతెలియని వ్యక్తి రైల్వే విద్యుత్ ట్రాన్స్‌ఫారం కు ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం అల్వాల్ క్యావలీ బ్యారెక్స్ వద్ద రైలు పట్టాల పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారంకు గుర్తుతెలియని 50ఏళ్ల వ్యక్తి చొక్కాతో ట్రాన్స్‌ఫారంకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సమస్యలకు నిలయం..
# లాలాగూడ రైల్వేస్టేషన్

- రైలు టికెట్ తీసుకోవాలన్నా ముళ్ల కంపల నుంచి వెళ్లాల్సిందే
- తాగునీరు, మరుగుదొడ్లు కరువు
- ప్లాట్‌ఫాంపైకి వెళ్లాలంటే రెండు ఫైఓవర్ బ్రిడ్జిలు దాటాలి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న లాలాగూడ రైల్వేస్టేషన్‌లో ఇరవై ఏళ్లుగా కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కనీస సౌకర్యాలు లేని ఈ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు కష్టాల మధ్య ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ స్టేషన్ నుంచి తెల్లవారుఝామున నుంచి రాత్రి 11 గంటల వరకు 33 ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించేందుకు రైల్వే అధికారులు పట్టించుకోకపోవడం ప్రయాణికులకు శాపంగా మారింది. రైల్వే మంత్రులు కేవలం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మాత్రమే ఆకస్మిక తనిఖీల పేరుతో తనిఖీలు చేస్తున్నారే తప్ప ఇలాంటి రైల్వేస్టేషన్‌ను పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ స్టేషన్‌లో తెల్లవారుఝామున నుంచి రాత్రి 12 గంటల వరకు బుకింగ్ కార్యాలయం తెరిచి ఉండాల్సి ఉండగా సాయంత్రం ఐదు గంటలకే బుకింగ్ కౌంటర్‌ను మూసివేస్తున్నారు. దాంతో ప్రయాణికులు టికెట్ లేకుండా రైళ్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### అసాంఘిక కార్యకలపాలు

రాత్రి 8 అయిందంటే చాలు ప్లాట్‌ఫాంపైనే మందుబాబులు మద్యం సేవించి ప్రయాణికులను ఇబ్బందులు పెడుతున్నారు. నిర్మానుష్యంగా ఉన్న ఈ రైల్వేస్టేషన్‌లో పేకాట ఆడుతూ అసాంఘిక కార్యకలపాలకు పాల్పడుతున్నారు. ఆర్పీఎఫ్ పోలీసుల తనిఖీలు లేకపోవడంతో రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా ఆర్పీఎఫ్ పోలీసులు రైల్వే స్టేషన్ లో గస్తీ తిరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





లాలాగూడ రైల్వే స్టేషన్ బోర్డు



లాలాగూడ రైల్వే స్టేషన్ దుస్థితి

### ఉపయోగంలేని మరుగుదొడ్లు

ఈ రైల్వేస్టేషన్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. దీంతో రైళ్లలో కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా లాలాగూడ రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే అరుణ్ కుమార్ జైన్ కార్యాలయానికి కేవలం కిలోమీటర్ దూరంలో ఉన్న రైల్వేస్టేషన్‌పై ఎందుకు శ్రద్ధ వహించడంలేదని ఆరోపిస్తున్నారు.

● ప్రయాణికులు ప్లాట్‌ఫాంకు వెళ్లాలంటే ముళ్లకంపల నుంచి నడుస్తూ రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు దాటిన తర్వాతే ఒకటవ, రెండవ ప్లాట్‌ఫాం చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎక్కలేని వృద్ధులు, దివ్యాంగులు రైల్వేస్టేషన్‌కు రావడంలేదు.

● ఇక్కడ ఐదేళ్ల క్రితం కొత్తగా బుకింగ్ కార్యాలయాన్ని నిర్మించారు. ఇప్పటివరకు కూడా ప్రారంభం కాలేదు. ఎక్కడైనా రైల్వేస్టేషన్‌లో రైళ్ల రాకపోకల సమయంలో మైకులో అనౌన్స్‌మెంట్ చేస్తారు. కానీ ఈ స్టేషన్‌లో రైళ్లు వస్తున్న సమయంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి మైకులో అనౌన్స్‌మెంట్ చేస్తుంటారు. లాలాగూడ రైల్వేస్టేషన్‌లో అనౌన్స్‌మెంట్ టెక్నాలజీ లేకపోవడం దారుణం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు, భద్రత కల్పించాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

### గస్తీ ఏర్పాటు చేయాలి



లాలాగూడ రైల్వేస్టేషన్ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. రాత్రి అయిందంటే చాలు తాగుబోతుల వీరంగం, వ్యభిచారులు పెట్రేగిపోతున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఈ స్టేషన్‌లో ప్రయాణికుల భద్రత గురించి ఆర్పీఎఫ్ పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు భద్రతకు గస్తీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. -శ్రీనివాస్ నాయక్

### మౌలిక సదుపాయలు కరువు



ఇక్కడ రైలు ఎక్కాలంటే కష్టమే. తాగేందుకు నీళ్లు, మరుగుదొడ్లు లేవు. స్టేషన్‌కు వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. రైల్ నిలయంలో ఉంటున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఒకసారి ఈ రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తే బాగుంటుంది. పూర్తిగా రక్షణ కల్పిస్తూ స్టేషన్‌ను బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - సువర్ణ

# నేటి నుంచి లాల్‌బజార్ బోనాలు

తిరుమలగిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లోని మహంకాళి దేవాలయం బోనాల జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం నుంచి మొదలుకుని గురువారం వరకు జరిగే జాతరకు దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, అదనంగా మరో 8 కెమెరాలను ప్రధాన రోడ్ల వద్ద ఏర్పాటు చేయడం జరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ సత్యచంద్రారెడ్డి తెలిపారు.

### బుధవారం ప్రత్యేకం

నగరంలో ఆది, సోమ వారాలు బోనాల జాతర జరుగుతుండగా లాల్‌బజార్‌లో మాత్రం బుధ, గురువారాలు బోనాల జాతర నిర్వహించడం విశేషం. మంగళవారం ఘటోత్సవం, బుధవారం బోనాలు, గురువారం భవిష్యవాణి, పచ్చికుండ ఎదుర్కోలు రాత్రికి అమ్మవారిని ఊరిపొలిమేర వరకు సాగనంపడంతో జాతర ముగుస్తుంది.



అమ్మవారి మూలవిరాట్

### భవిష్యవాణి

సికింద్రాబాద్ మహంకాళి జాతరలో మహిళ భవిష్యవాణి వినిపించడం ఆనవాయితీ. అయితే లాల్‌బజార్ పురుషుడు భవిష్యవాణి వినిపించడం విశేషం. భవిష్యవాణి వినడానికి నగరవ్యాప్తంగా భక్తులు తరలివస్తారు. ఏర్పుల జగదీష్ భవిష్యవాణి వినిపిస్తారు.

### ఆలయ చరిత్ర

తిరుమలగిరి లాల్‌బజార్‌కు చెందిన గంగయ్యబట్టికి చెందిన కుమ్మరి గంగయ్య ఇంటి పెంకులను బండిపై అమ్ముకుంటూ దట్టమైన అడవిలో ఒకచోట(ప్రస్తుత లాల్‌బజార్) బండి పెట్టుకుని ఒక చెట్టు కింద నిద్రపోయాడు. అమ్మవారు అతడి కలలోకి వచ్చి ఒక చెట్టు కింద వెలిశాను, చిన్న గుడి కట్టి నిత్యం పూజలు చేయాలని చెప్పింది. గంగయ్య లేచి చూడగా అమ్మవారి మూలవిరాట్ కనిపించింది. అదే ప్రాంతంలో చిన్న గుడి కట్టి పూజలు చేయసాగారు. మరొకరోజు లాల్‌బజార్ కొండల పెరుమక్క కలలోకి అమ్మవారు వచ్చి గుడి కట్టించాలని అడిగారట. ప్రస్తుతం ఉన్న గుడి ఆమె నిర్మించారు.

### అన్ని ఏర్పాట్లు చేశాం

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా బోనాల వేడుకలలో ఉన్నాయి. బోనాలు ఎత్తుకుని వచ్చిన మహిళలకు ప్రత్యేకమైన లైన్లను ఏర్పాటు చేయడం జరిగింది.
- మురళీ ముదిరాజ్ (దేవాలయ చైర్మన్)

### భారీ బందోబస్తు



నాగరాజు, ఇన్‌స్పెక్టర్

బోనాల జాతరకు బొల్లారం కార్ఖానా ఇన్‌స్పెక్టర్లు ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశాం. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నాం. కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షణ జరుగుతుంది. ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నాం.

## ప్రజావాణికి అర్జీలు 353

బేగంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీ.ఎం ప్రజావాణికి మొత్తం 353 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమ ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు 60, రెవెన్యూకు 63, విద్యుత్‌కు 22, రేషన్‌కార్డుల కోసం 07, ఇందిరమ్మ ఇళ్ల కోసం 57, ఇతర శాఖలకు సంబంధించి 144 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు.



ప్రజావాణిలో చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్‌లు

## ఓపెన్ వర్సిటీలో యూజీ, పీజీ అడ్మిషన్ల ప్రారంభం

బేగంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బేగంపేట సెంటర్‌లో డిగ్రీ, పీజీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ రామాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైనవారు డిగ్రీకి అర్హులని పేర్కొన్నారు. ఎంఏ హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు లిటరేచర్, ఇంగ్లీషు లిటరేచర్, హిందీ లిటరేచర్, ఉర్దూ లిటరేచర్‌లో డిగ్రీ ఉత్తీర్ణత గలవారు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. తుదిగడువు ఆగస్టు 13వ తేదీ అని పేర్కొన్నారు.

# సాంకేతిక పురోగతి సాధించాలి: జయేష్ రంజన్

అల్వాల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో మంగళవారం వరల్డ్ యూత్ స్కిల్స్ డే-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ సాంకేతిక పురోగతిని సాధించడం ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. డిజిటల్ లిటరసి ప్రాముఖ్యతను కూడా ఆయన వివరించారు. ఉచిత ఆన్‌లైన్ కోర్సులను కూడా ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ రజనిప్రియా మాట్లాడుతూ భారతదేశ యువత భవిష్యత్‌ను తీర్చిద్దిడానికి, ఉపాధిని పెంపొందించడానికి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలో ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) డిజిటల్ ఆవిష్కరణలతో ముఖ్య పాత్రను ఆమె హైలెట్ చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల నుంచి విద్యార్థులు విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.



వరల్డ్ యూత్ స్కిల్స్ డే-2025 కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జయేష్ రంజన్

## 'పీహెచ్‌డీ కేటగిరీ-2 అడ్మిషన్ల ఫలితాలు ఎస్సీ వర్గీకరణ ప్రకారమే విడుదల చేయాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ కేటగిరీ-2 అడ్మిషన్ల తుది ఫలితాలను ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకర ప్రకారమే విడుదల చేయాలని మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ వైస్ చాన్స్‌లర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎస్సీల్లోని మాదిగలు, మిగతా ఉపకులాల వారు విద్యా, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు అందక తీవ్రంగా నష్టపోయారని, ఈ ఏడాది ఏప్రిల్ 14 నుంచి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి నుండి టీజీపీసెట్-2025 నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 20, 2025న ఇచ్చారని, కానీ ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ ప్రకారమే అందులో అడ్మిషన్లను కేటాయిస్తున్నారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ తుది ఫలితాలలో కూడా వర్గీకరణ అమలు చేయాలని కోరారు.

## 'కమ్యూనిటీ హాల్ వేలం ప్రక్రియను నిలిపివేయాలి'

కాప్రా, జూలై 15 (ఆంధ్రజ్యోతి): హెచ్‌బీ కాలనీ రోడ్డులోని హౌసింగ్ బోర్డు కమ్యూనిటీ హాల్ వేలం ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ వివిధ కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మంగళవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. హౌసింగ్ బోర్డు వారు వేలం ప్రక్రియ ద్వారా కమ్యూనిటీ హాల్‌ను విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని, ఇందుకు సంబంధించి కోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసి కాలనీ అసోసియేషన్‌లకు నోటీసులు జారీ చేశారని వారు ఎంపీకి వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, వేలం ప్రక్రియను నిలిపివేయించి కమ్యూనిటీ హాల్‌ను కాపాడతానని ఎంపీ హామీ ఇచ్చారు. కార్పొరేటర్ జె.ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌బీ కాలనీ ఫేజ్-1, ఫేజ్-2 అసోసియేషన్ల అధ్యక్షులు శివరామ్‌ప్రసాద్, వెంకటాచారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి

## బోనాల జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఏసీపీ శశాంక్‌రెడ్డి

బౌద్ధనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శాంతియుత వాతావరణంలో బోనాల జాతరను నిర్వహించుకోవాలని చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్ రెడ్డి కోరారు. మంగళవారం చిలకలగూడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇన్‌స్పెక్టర్ అనుదీప్ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయాల నిర్వాహకులు, కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 20వ తేదీన చిలకలగూడ కట్టమైసమ్మ పోచమ్మ ఆలయంతో పాటు వివిధ ఆలయాల్లో బోనాల జాతర జరగనున్నాయని, దీనికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫలహారబండ్లు, తొట్టెల ఊరేగింపుకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. ప్యాడ్ బ్యాండ్, డీజేలకు అనుమతి లేదని, ఆలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ బోనాల జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ వేడుకల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో అడ్మిన్ ఎస్సై అంజనేయులు, ఎస్సై జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి-తిరుపతి మార్గంలో ప్రత్యేక రైళ్లు పొడిగింపు

హైదరాబాద్ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి-తిరుపతి మార్గంలో నడుస్తున్న 4 ప్రత్యేకరైళ్లను వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగించాలని దక్షిణమధ్యరైల్వే నిర్ణయించింది. ప్రతి ఆది, బుధవారాల్లో చర్లపల్లి నుంచి తిరుపతికి 07017/ 07251 ప్రత్యేకరైళ్లు, ప్రతి సోమ, గురువారాల్లో తిరుపతి నుంచి చర్లపల్లికి 07018/07252 ప్రత్యేకరైళ్లు ప్రయాణికులకు అందుబాట్లో ఉంటాయని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు.



బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ విద్యార్థిసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామిగౌడ్ తదితరులు

## బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలి

తార్నాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఓయూ పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియలో బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామిగౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీ విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని, అన్ని అర్హతలు ఉన్న బీసీ విద్యార్థులకు బీసీ రిజర్వేషన్లను అమలు చేయకపోవడంతో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని దానికి ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు కౌశిక్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఫెడరేషన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం

## టీజీడీడీసీఎఫ్ అధ్యక్షుడి ఎన్నిక

తార్నాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఫెడరేషన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(టీజీడీడీసీఎఫ్) అధ్యక్షుడుగా సాల యాదగిరి ఎన్నికయ్యారు. టీజీడీడీసీఎఫ్ బి-22 ఐఎన్‌టీయూసీ జనరల్ బాడీ సమావేశాన్ని మంగళవారం లాలాపేట్‌లోని విజయా డెయిరీ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అనంతరం యూనియన్ ప్రతినిధులు టీజీడీడీసీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాల యాదగిరి ఎన్నిక కాగా, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.అశోక్ కుమార్, జనరల్ సెక్రటరీ జి.బాల ప్రసాద్, జాయింట్ జనరల్ సెక్రటరీ కె. శ్రీధర్, అడిషనల్ జనరల్ సెక్రటరీ విజయలక్ష్మి, ఉమా మాటూరీ, కోశాధికారికారులుగా పి.నిఖిల్ కుమార్, ఎస్.మౌనికలు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ విజయా డెయిరీ యాజమాన్యానికి ఉద్యోగులకు మధ్య వారధిగా ఉంటూ డెయిరీ అభివృద్ధితో పాటు, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు.